

రూ.1,01,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కొలుసుమ సాయి దుర్గేష్ కుటుంబ సభ్యులు (రాజమహేంద్రవరం) రూ.1,01,116 విరాళం సమర్పించారు.



మెరికలకు మెరుగులు

వేసవి సెలవులు వృథా కాకుండా పలువురు విద్యార్థినులు కాకినాడ గుడారిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖోఖో ఉచిత శిక్షణ పొందుతున్నారు. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.1°/25.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	32.0	25.0
కాకినాడ	35.1	27.0
అమలాపురం	35.0	27.0

న్యూస్‌రీల్

వచ్చే నెల 15లోగా ఖరీఫ్ నారుమళ్లు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మధురపూడి: ఖరీఫ్ సాగుకు రైతులను సన్నద్ధం చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించేందుకు, వారి వద్ద ఉన్న రబీ ధాన్యాన్ని పరిశీలించేందుకు ఆయన శుక్రవారం కోరుకొండ మండలం కోటి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి వచ్చే నెల 15వ తేదీలోగా వరి నారుమళ్లు వేయాలని, జూలై 15వ తేదీలోగా నాట్లు పూర్తి చేయాలని రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువులనే వినియోగించాలని, ఎకరానికి నాలుగైదు సెంట్ల విస్తీర్ణంలో మాత్రమే నారుమడులు వేయాలని అన్నారు. ఎకరానికి 25 కేజీల విత్తనాలు సరిపోతాయన్నారు. విత్తన శుద్ధి చేసిన వాటిని మాత్రమే సాగుకు ఉపయోగించాలని పేర్కొన్నారు. రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని, ఇందులో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. లక్ష్యం మేరకు 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. ప్రైవేటుగా మంచి ధర పలకడం, పొలాల నుంచే వ్యాపారులు ధాన్యం తీసుకుని వెళ్లడంతో పలువురు రైతులు వ్యాపారులకే అమ్ముకున్నారని మాధవరావు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా వాసవీ మాత



ధవళేశ్వరం: గ్రామంలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం ధనలక్ష్మిగా అలంకరించారు. సుమారు రూ.6 లక్షల కొత్త నోట్లతో అమ్మవారికి, ఆలయానికి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా శనివారం ఉదయం కన్యలతో పూజలు, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

పారితోషికాల సవరణపై ఉద్యోగుల హర్షం

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది పారితోషికాల్లో వ్యత్యాసాలను సవరిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాలు జారీ చేయడంపై ఏపీ ఎన్‌జీఓ సంఘం నేతలు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 15న వారు ఇచ్చిన వినతికి స్పందించిన కలెక్టర్ ఈ మేరకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలపై ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వేణుమాధవ్, ఏపీ ఎన్‌జీఓ సంఘం నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు మాధవరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పైకి పొత్తులు.. వెనుక కత్తులు!



ముళ్లపూడి వర్గం గరంగరం

గోపాలపురంలో తాను వ్యతిరేకించిన మద్దిపాటి వెంకట్రాజుకు టీడీపీ టికెట్టు ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలను ఆ పార్టీకి చెందిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మొదటి నుంచీ వ్యతిరేకించారు. అయితే, మద్దిపాటి వెంకట్రాజుకే బాబు టికెట్టు ఇచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ముళ్లపూడి వర్గం ఏకంగా చంద్రబాబునే అడ్డుకునేందుకు ప్రయత్నించింది. అనంతరం బాబు మైండ్‌వాష్‌తో ముళ్లపూడి బెట్టు వీడి.. కాస్త మెట్టు దిగారు. మద్దిపాటికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రచారంలో పాల్గొన్నారు. అయితే, ఈ పరిణామం ఆయన వర్గీయుల్లో ఆగ్రహావేశాలు నింపింది. ఎన్నికల్లో ఆ వర్గం ముళ్లపూడికి దూరమైంది. చేసేది ముళ్లపూడి సైతం పైకి మద్దిపాటికి సహకరిస్తున్నట్లు ఉన్నా.. లోలోపల మాత్రం అనుకున్న సహకారం అందించలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

రాజానగరంలోనూ అంతే..

రాజానగరంలోనూ ఇదే పరిస్థితి. ఈ ఎమ్మెల్యే సీటును టీడీపీ నేత బొడ్డు వెంకట రమణ చౌదరికి కేటాయించనున్నామని చంద్రబాబు తొలినాళ్లలో చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు సైతం అప్పగించారు. అంతలోనే అనూహ్యంగా జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ తెర పైకి వచ్చారు. ఈ పరిణామం బొడ్డు వర్గంలో ఆగ్రహావేశాలు నింపింది. బాబు బుజ్జగింపులతో మెత్తబడిన బొడ్డు.. జనసేన నేత బత్తులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తమ వర్గాన్ని సైతం ఆయన వెంట తిప్పారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. తీరా పోలింగ్ సమయంలో మాత్రం ఆశించిన మేరకు సహకారం అందించలేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

శేషారావు సైలెంట్?

టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సైతం నిడదవోలు నుంచి ఆ పార్టీ టికెట్టు ఆశించి భంగపడ్డారు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా రాజమండ్రి రూరల్‌లో ఉన్న జనసేన నేత కందుల దుర్గేష్‌కు నిడదవోలు టికెట్టు ఇచ్చారు. దీనిపై కొన్నాళ్లు వర్గవిభేదాలు కొనసాగినా.. చంద్రబాబు జోక్యంతో ఇద్దరి మధ్యా సయోధ్య కుదిరింది. దుర్గేష్‌ను గెలిపించాలని తన వర్గీయులను, ప్రజలను శేషారావు కోరారు. అందుకుగాను ప్రజల కాళ్లు మొక్కుతున్నట్లు సభలో పాదాభివందనం చేశారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఒకవేళ దుర్గేష్‌ను గెలిపిస్తే తన రాజకీయ భవిష్యత్తు ఏమిటనే ఆందోళన ఆయనను వెంటాడింది. అలా జరగడం తనకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని భావించిన శేషారావు.. పోలింగ్‌కు వారం రోజుల ముందు నుంచి దుర్గేష్‌కు ఆశించిన మేర సహకారం అందించలేదని చెబుతున్నారు. పైకి మాత్రం రోజంతా ప్రచారాల్లో పాల్గొంటున్నా.. దుర్గేష్‌కు కచ్చితంగా ఓటేయాలని తన వర్గానికి శేషారావు సూచించలేదని అంటున్నారు. రాజమండ్రి సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో వింత పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే ఓటు తమకు వేయాలని, ఎంపీ ఓటు మీ ఇష్టమని టీడీపీ రూరల్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు ప్రచారం చేసినట్లు తెలిసింది.

- కూటమి అభ్యర్థుల్లో అంతర్మథనం
- గెలుపుపై సన్నగిల్లుతున్న నమ్మకం
- వలస అభ్యర్థులకు సహకరించని స్థానిక నేతలు
- వాళ్లు నిజంగా మద్దతు ఇచ్చారో లేదో తెలియక మల్లగుల్లాలు

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ముగిసి, నాలుగు రోజులైంది. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో బరిలోకి దిగిన అభ్యర్థులు గెలుపోటములపై బేరీజు వేసుకుంటున్నారు. పోలింగ్ సరళిపై లెక్కలతో కుస్తీలు పడుతున్నారు. ఏ వర్గం, ఏ వార్డు తమకు అండగా నిలిచాయో అంచనా వేసుకుంటున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. సీట్ల సర్దుబాటులో భాగంగా వివిధ నియోజకవర్గాల్లో కూటమి తరఫున పోటీ చేసిన వలస అభ్యర్థుల్లో మాత్రం గెలుపుపై మీమాంస నెలకొంది. కూటమిలోని ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు కీలకమైన పోలింగ్ సమయంలో నిజంగానే తమకు మద్దతు తెలిపారా లేక వెన్నుపోటు పొడిచారా అని అనుమానపడుతున్నారు. కడుపులో కత్తులు పెట్టుకుని పైకి మాత్రం కౌగిలించుకున్న చందంగా వ్యవహరించారా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. బయటకు తమతో తిరుగుతూనే.. ఓటు వేయించాల్సిన సమయంలో మిన్నకుండిపోయారేమోనని, అదే జరిగితే తమ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన చెందుతున్నారు.

కూటమి తెచ్చిన తంటా

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. సీట్ల సర్దుబాటులో భాగంగా జిల్లాలోని నిడదవోలు, రాజానగరం అసెంబ్లీ స్థానాలను జనసేనకు.. రాజమండ్రి ఎంపీ, అనపర్తి ఎమ్మెల్యే స్థానాలను బీజేపీ కట్టబెడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం ఆయా స్థానాల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఆశిస్తున్న టీడీపీ నేతలకు అప్పట్లోనే మింగుడు పడలేదు. దీంతో ఆ పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. చివరకు అధినేత చంద్రబాబునే ఎదిరించి, అడ్డుకునే స్థాయికి చేరాయి. నేతల ఆందోళనకు తలొగ్గిన బాబు రాజీ మంత్రం పఠించారు. అసమ్మతి నేతలను పిలిపించుకుని బుజ్జగించారు. విభేదాలు పక్కన పెట్టి కలసికట్టుగా పని చేయాలని హితబోధ చేశారు. కూటమి అధికారంలోకి వస్తే తగిన గుర్తింపు కల్పిస్తామని ఎర వేశారు. పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినా.. బాబు పట్టించుకోకపోవడంతో అదును చూసి దెబ్బ కొట్టాలని టీడీపీ శ్రేణులు భావించాయి. దీంతో అప్పటికి బాబు ప్రతిపాదనకు ఓకే చెప్పేశారు. ఇంకేముంది! బీజేపీ, టీడీపీ, జనసేన శ్రేణులన్నీ కలసికట్టుగా పని చేస్తాయని చంద్రబాబు భావించారు. బాబు భరోసాతో కొందరు టీడీపీ నేతలు ప్రచారాన్ని ముందుండి నడిపించారు. కూటమి అభ్యర్థిని గెలిపించాలని విస్తృతంగా పర్యటించారు. కానీ, నిజంగా పోలింగ్ సమయం వచ్చేసరికి కూటమిలోని కొంత మంది ఇతర పార్టీల నేతలు అనూహ్యంగా అభ్యర్థులకు వ్యతిరేకంగా పని చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా టీడీపీ నేతలే ఈవిధమైన చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ మిత్రపక్షం అభ్యర్థి గెలిస్తే తమ రాజకీయ భవిష్యత్తు దెబ్బ తింటుందనే ఉద్దేశంతోనే వారు ఈవిధంగా చేశారని అంటున్నారు.

చిన్నమ్మకు చుక్కెదురు

రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసిన విషయం తెలిసిందే. రాజమండ్రిలో రంగప్రవేశం చేసిన వెంటనే చిన్నమ్మ తనదైన శైలిలో వ్యవహారం నడిపారు. సొంత పార్టీ బీజేపీనే విస్మరించారు. సొంత దుకాణం తెరిచారు. స్వపక్ష నేతలను పక్కన పెట్టారు. టీడీపీ నేతలు, తన మరిది చంద్రబాబు ప్రయోజనాల కోసం పాటు పడ్డారు. ఈ పరిణామం అప్పటికే రాజమండ్రి ఎంపీ స్థానం ఆశిస్తున్న టీడీపీ నేత బొడ్డు వెంకట రమణ చౌదరి వర్గంలో ఆగ్రహావేశాలను నింపింది. ఈ వర్గం ఎన్నికల్లో పైకి మద్దతు తెలిపినట్లు నటించినా.. లోలోపల మాత్రం ఆమెకు సహకరించిన దాఖలాలు లేవు. పార్లమెంటరీ నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి. పురందేశ్వరిపై ఉన్న వ్యతిరేకతతో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు ఓటు వేయాలంటూ కొందరు కూటమి నేతలే ప్రచారం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కూటమిలోని ఇతర పార్టీల నేతలు సహకరించకపోవడంతో పురందేశ్వరి తన విజయంపై ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యే అభ్యర్థులకు ఇవ్వాల్సిన ఎన్నికల నిధుల్లో సైతం చిన్నమ్మ కోత విధించడంతో పార్లమెంటరీ నియోజకవర్గ వ్యాప్తంగా ఆమెకు వ్యతిరేక పవనాలు వీచినట్లు చెబుతున్నారు.

అధిక రక్తపోటుతో అనర్థాలు



ర్యాలీలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ఆధునిక జీవనశైలి వల్ల అధిక రక్తపోటు (బీపీ) వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బొమ్మూరులోని తన కార్యాలయంలో ప్రపంచ రక్తపోటు దినం (వరల్డ్ హైపర్ టెన్షన్ డే) సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీపీ ఉందన్న విషయం తెలుసుకునేలోపే ఆ వ్యాధి వల్ల జరిగే అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బ తింటున్నాయని అన్నారు. 'మీ రక్తపోటును కచ్చితంగా కొలవండి, అదుపులో పెట్టండి, ఎక్కువ కాలం జీవించండి' అనే స్లోగన్‌ను ఈ ఏడాది థీమ్‌గా ప్రకటించారన్నారు. రక్తపోటును నియంత్రించడం ద్వారా ఆరోగ్యకరమైన, సుదీర్ఘమైన జీవితం గడపడం సాధ్యమని చెప్పారు. జిల్లాలో వివిధ ఆరోగ్య శిబిరాలు, హెల్త్ క్లినిక్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆహార, జీవనశైలి మార్పులపై సదస్సులు, ఉచిత బీపీ పరీక్షలు, వైద్యుల ఉచిత సలహాలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలని, ఉప్పు తగ్గించాలని, నిత్యం వ్యాయామం చేయాలని, అధిక బరువును, ఒత్తిడిని నియంత్రణలో ఉంచాలని, ధూమపానం, మద్యపానం మానుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైతే వైద్యులు సూచించిన మందులు వాడాలని, హోమ్ బీపీ మానిటర్ల ద్వారా రక్తపోటును పర్యవేక్షించుకోవాలని డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా ఎపిడమాలజిస్ట్ సుధీర్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలో 17,98,643 జనాభా ఉందని, వీరిలో 30 సంవత్సరాల వయస్సు పైబడిన వారు 11,69,017 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో 83 శాతం మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా 1,15,715 మందికి బీపీ ఉన్నట్టు నిర్ధారించి, 93,984 (81.22%) మందికి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ అధికారి డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా టీడీపీ ఆత్మీయ భేటీ

నల్లజర్ల: ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటికీ ఇంకా ఫలితాలు వెల్లడి కాకపోవడంతో ఎన్నికల కమిషన్ ఇంకా కోడ్ అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో 144 సెక్షన్ కొనసాగుతోంది. ఈ తరుణంలో టీడీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఎలాంటి అనుమతులూ లేకుండా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో శుక్రవారం ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేశారు. నిబంధనలు అంగీకరించకపోవడంతో పోలీసులు ఈ సమావేశాలను అడ్డుకున్నారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అల్లర్లు జరుగుతున్న దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు, ఎన్నికల అధికారులు టీడీపీ ఆత్మీయ సమావేశాలకు అనుమతులు నిరాకరించారు. అయినప్పటికీ అధికారులను ఖాతరు చేయకుండా సమావేశాలకు ఉపక్రమించిన టీడీపీ నేతలను కొవ్వూరు డీఎస్పీ రామారావు, సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడా ఎటువంటి సమావేశాలూ నిర్వహించరాదని ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపల్లిలో ఎస్‌వీఆర్ కల్యాణ మండపం వద్ద డీఎస్పీ రామారావు ఆధ్వర్యాన పోలీసులు మోహరించారు. దీంతో అనంతపల్లి చేరుకున్న నాయకులందరూ మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఇంటి వద్ద సమావేశమై, ఎక్కడివారక్కడకు వెనుతిరిగి వెళ్లిపోయారు.

స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

- వచ్చే నెల 4 వరకూ 144 సెక్షన్
- కలెక్టర్ మాధవీలత



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో ఎస్పీ జగదీష్, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరచిన ఆయా స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లాల ఎన్నికల అధికారులు, ఐజీలు, డీఐజీలు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో వివిధ అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత విషయంలో ఎస్పీతో కలసి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, మొబైల్ టీములతో భద్రత కల్పించామన్నారు. సీసీ కెమెరాల నిఘా, నిరంతర పర్యవేక్షణతో, మూడంచెల భద్రతతో, మూడు షిఫ్టుల్లో పహారా ఏర్పాటు చేశామని వివరించారు. కౌంటింగ్ ఏర్పాట్లు, ముందు జాగ్రత్తలపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. స్ట్రాంగ్ రూములో ఎటువంటి షార్ట్ సర్క్యూట్ జరగకుండా విద్యుత్ సరఫరా నిలుపు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ, ఈవీఎంలు భద్రపరచిన ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత కల్పించామన్నారు. జిల్లాలో వచ్చే నెల 4వ తేదీ వరకూ ఎటువంటి ముందస్తు అనుమతీ లేకుండా మత, రాజకీయ పరమైన సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల భద్రతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా పలు సూచనలు చేశారు.

రత్నగిరి.. కల్యాణసిరి..

- నేటి నుంచి సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు
- ముస్తాబైన అన్నవరం క్షేత్రం
- నేడు వధూవరులుగా అమ్మవారు, స్వామివారి అలంకరణ
- అనంతరం ఎదుర్కోలు ఉత్సవం
- కొండ దిగువన వెండి ఆంజనేయ వాహనంపై సీతారాముల ఊరేగింపు
- రేపు రాత్రి కల్యాణోత్సవం



సత్యదేవుడు, అమ్మవారు

అన్నవరం: ఇంట్లో వివాహమైనా, గృహప్రవేశమైనా, మరే ఇతర శుభకార్యమైనా సత్యదేవుని వ్రతమాచరించని తెలుగువారుండరంటే అతిశయోక్తి కాదు. తన వ్రతమాచరిస్తేనే కోరిన కోర్కెలు తీర్చే భక్తసులభుడు శ్రీ అనంతలక్ష్మీ సత్యవతీదేవీ సమేత శ్రీ సత్యదేవుడు. వివాహమైన వెంటనే నవదంపతులు పెళ్లి బట్టలతోనే రత్నగిరికి చేరుకుని, సత్యదేవుని వ్రతమాచరించడం ఆనవాయితీ. ఏటా 10 వేల మందికి పైగా కొత్త జంటలు ఈవిధంగా స్వామివారి వ్రతాలాచరిస్తున్నారంటే సత్యదేవునిపై వారి విశ్వాసం ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. అటువంటి మహత్తు కలిగిన స్వామిని దర్శించినా భాగ్యమే. ఏడాదికొకసారి జరిగే ఆ సత్యదేవుని దివ్యకల్యాణం కన్నులారా వీక్షిస్తే మరెంత భాగ్యమో చెప్పనలవి కాదు. భక్తుల పాలిట కొంగుబంగారంగా కీర్తినందుకున్న అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామివారి వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతున్న శుభ వేళ.. అన్నవరం క్షేత్రం, స్వామివారిని తన శిరసున మోస్తున్న రత్నగిరి సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భక్తులు కోరిన వెంటనే రత్నాల్లాంటి బిడ్డలను, సిరిసంపదలను, ఆయురారోగ్యాలను ప్రసాదించే సత్యమైన దైవంగా పేరొందిన సత్యదేవుడే వరునిగా.. దేవేరి శ్రీ అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వధువుగా దర్శనమిచ్చే శుభ తరుణం సమీపించిన వేళ.. రత్నగిరి కల్యాణ కాంతులతో ప్రకాశిస్తోంది.

శ్రీకారం చుట్టుకుంటోందిలా..

కల్యాణోత్సవాలకు వైశాఖ శుద్ధ దశమి శనివారం శ్రీకారం చుట్టనున్నారు. సాయంత్రం 4 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించే కార్యక్రమం కన్నుల పండువగా జరగనుంది. రత్నగిరిపై అనివేటి మండపంలో పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ జరిగే ఈ కార్యక్రమంలో ముత్తయిదువులు శుభం కోరుతూ పసుపు దంచుతారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. రాత్రి ఏడు గంటలకు రాజా రామారాయ కళావేదికపై స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పండితులు వధూవరుల తరఫున రెండుగా విడివడి, వధువు గొప్పతనాన్ని కొందరు, వరుడి వంశ ఖ్యాతిని మరికొందరు వివరిస్తూ వినోదాన్ని పంచుతారు.

సీతారాములే పెళ్లిపెద్దలు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలకు రత్నగిరి క్షేత్ర పాలకులు శ్రీ సీతారాములే పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. వెండి ఆంజనేయ వాహనం మీద సీతారాములను శనివారం రాత్రి కొండ దిగువన ఊరేగిస్తారు. ఈ సందర్భంగా సత్యదేవుని కల్యాణానికి రావాలని భక్తులకు, అన్నవరం గ్రామస్తులకు పెళ్లిపెద్దలు ఆహ్వానం పలుకుతారు.

కల్యాణ వేదిక ముస్తాబు

సత్యదేవుని దివ్య కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి 9 గంటల నుంచి రత్నగిరిపై రామాలయం పక్కన ఉన్న వార్షిక కల్యాణ వేదిక మీద వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణ వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. దీంతో పాటు కల్యాణ వేదిక ముందున్న విశ్రాంతి మండపం, ఆలయ ప్రాంగణం, అనివేటి మండపాన్ని సైతం సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరిస్తున్నారు. వేదిక ముందున్న వారు మాత్రమే కాకుండా దూరంగా ఉన్నవారు కూడా కల్యాణోత్సవాన్ని తిలకించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. వెనుకన ఉన్నవారు కూడా స్వామివారి కల్యాణం తిలకించేలా స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్సవ వాహనాలకు మెరుగులు

కల్యాణ మహోత్సవాల సందర్భంగా సత్యదేవుడిని, అమ్మవారిని ఊరేగించే ఉత్సవ వాహనాలు, వెండి గజ, గరుడ, ఆంజనేయ వాహనాలకు మెరుగులు పెట్టించడంతో తళతళా మెరుస్తున్నాయి. వీటికి కాకినాడకు చెందిన జ్యూయలరీ వర్క్స్ అధినేత, గోల్డ్ అప్రైజర్ పీవీఎల్ మూర్తి ఉచితంగా మెరుగు పెట్టించారు. ఏటా ఉత్సవ వాహనాలతో పాటు, వెండి సింహాసనాలు, వెండి మకరతోరణం వంటి వాటికి తాను మెరుగు పెట్టిస్తానని ఆయన తెలిపారు. అలాగే, కొండ దిగువన రావణబ్రహ్మ, పొన్నచెట్టు చెక్క వాహనాలకు కూడా దేవస్థానం అధికారులు రంగులు వేయించి, ముస్తాబు చేయించారు.





సత్యదేవుని కల్యాణోత్సవం నిర్వహించే వార్షిక కల్యాణ వేదిక

అన్నవరంలో నేడు

- **తెల్లవారుజామున 3.00:** సుప్రభాత సేవ.
- **ఉదయం 8.00:** చతుర్వేద పారాయణ.
- **సాయంత్రం 4.00:** అనివేటి మండపంలో సత్యదేవుడిని, అమ్మవారిని పెండ్లి కుమారుని, పెండ్లికుమార్తెను చేయడం.
- **రాత్రి 7.00:** రత్నగిరిపై శ్రీరాజా వేంకట రామారాయ కళామందిరంలో ఎదుర్కోలు ఉత్సవం.
- **రాత్రి 9.00:** కొండ దిగువన పెళ్లిపెద్దలు సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై ఊరేగింపు.
- **ఉదయం 7.00 – 10.00, సాయంత్రం 5.00 – రాత్రి 11.00:** రత్నగిరి కళావేదిక, కొండ దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు.

ఇదీ కల్యాణోత్సవాల క్రమం

- 18.05.2024: సాయంత్రం 4 గంటలకు వధూవరులుగా అమ్మవారు, సత్యదేవుని అలంకరణ. రాత్రి 9 గంటలకు కొండ దిగువన వెండి ఆంజనేయ వాహనంపై పెళ్లిపెద్దలు సీతారాముల ఊరేగింపు.
- 19.05.2024: ఉదయం 9 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణధారణ, రుత్విక్కుల దీక్షావస్త్రధారణ. రాత్రి 7 గంటలకు కొండ దిగువన వెండి గరుడ వాహనంపై స్వామివారు, వెండి గజ వాహనంపై అమ్మవారు, వెండి పల్లకీపై సీతారాముల ఊరేగింపు. రాత్రి 9 గంటల నుంచి రత్నగిరి కల్యాణ వేదిక మీద సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవం.
- 20.05.2024: రాత్రి 7 గంటలకు అరుంధతీ నక్షత్ర దర్శనం. రాత్రి 9 గంటలకు కొండ దిగువన రావణబ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు.
- 21.05.2024: మధ్యాహ్నం 2.30 గంటలకు అనివేటి మండపంలో పండిత సదస్యం. రాత్రి 9 గంటలకు: పొన్న వాహనంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు.
- 22.05.2024: సాయంత్రం 4 గంటలకు దేవస్థానం ఉద్యాన వనంలో సత్యదేవుడు, అమ్మవార్ల వనవిహారోత్సవం. సాయంత్రం 5 గంటలకు: నూతన టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవార్ల గ్రామోత్సవం.
- 23.05.2024: ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో స్వామి, అమ్మవార్ల శ్రీచక్రస్నానం. సాయంత్రం 4 గంటలకు: నీలలోహిత గౌరీపూజ, నాకబలి, దండియాడింపు, ధ్వజావరోహణం, కంకణ విమోచన.
- 24.05.2024: రాత్రి 7.30 గంటలకు రత్నగిరిపై స్వామివారి నిత్యకల్యాణ మండపంలో స్వామివారి శ్రీపుష్పయాగం.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ : వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం వద్ద ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని తలకు తీవ్రగాయాలై ఒక వ్యక్తి మృతిచెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శుక్రవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం విజ్జేశ్వరం గ్రామానికి చెందిన కోడూరి లక్ష్మణరావు(57) ఈ నెల 16వ తేదీ రాత్రి మోపెడ్‌పై కిరాణా సరుకులు తీసుకుని నిడదవోలు నుంచి ఇంటికి వెళుతుండగా విజ్జేశ్వరం అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలైన లక్ష్మణరావు ఘటనా స్థలంలో మృతిచెందినట్లు కొడుకు సాయిసూర్యనారాయణ శాస్త్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన 50 ఏళ్ల ముమ్మని సూర్యప్రసాద్ కనిపించడం లేదని ఆయన భార్య ముమ్మని పోశిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యప్రసాద్ ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున తన జిరాక్స్, కూల్ డ్రింక్ షాపునకు ఇంటి నుంచి వెళ్లారు. సూర్యప్రసాద్ తండ్రి కోడలు పోశిలక్ష్మి వద్దకు వచ్చి తన కుమారుడు 'నాకు కష్టాలు ఉన్నాయి, వెళ్లిపోతున్నాను' అని వాట్సాప్‌లో మెసేజ్ పెట్టినట్టు అతని స్నేహితులు చెప్పారని, షాపు వద్దకు వెళ్లగా మూసి ఉందని తెలిపారు. బంధువులు చుట్టుపక్కల గాలించినా కనిపించలేదు. దాంతో భార్య పోశిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మృతి

అనపర్తి: మండలంలోని కుతుకులూరు కోటేశ్వరస్వామి కాలనీకి చెందిన మహిళ శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేడవరపు రామతారకం (55) ఇంటిలో చెత్తను పారేసేందుకు గాను నివాసానికి సమీపంలో ఉన్న నాగుల పుట్ట వెనుకకు వెళ్లారు. ఈ సమయంలో చెత్తను బయట పారవేసిన ఆమె అక్కడ ఉన్న ఇనుప కంచెను చేతితో తాకారు. అయితే ఇనుప కంచెకు విద్యుత్తు ప్రవహిస్తుండటంతో విద్యుదాఘాతానికి గురై ఆమె మృతి చెందారు.

చెక్‌పోస్టు తొలగింపు

కడియం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పొట్టిలంక వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తొలగించినట్టు కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ చెక్‌పోస్టులో వాహన తనిఖీల్లో భాగంగా రూ. 3.25 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదును సిబ్బంది స్వాధీనం చేసుకున్నారన్నారు.

తల్లీ కుమార్తెల అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: గుడికి వెళ్లిన తన భార్య, కుమార్తె కనిపించడం లేదని కవలగొయ్యి గ్రామానికి చెందిన చిచ్చర ఆదినారాయణ శుక్రవారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదినారాయణకు భార్య ఆదిలక్ష్మి, ఐదేళ్ల కుమార్తె శ్రీవిద్య ఉన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో కవలగొయ్యిలోని దుర్గగుడికి తల్లీ కుమార్తెలు వెళ్లారు. కానీ తిరిగి రాలేదు. ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరికలకు మెరుగులు

- ఖోఖోలో రాణిస్తున్న యువత
- కాకినాడలో 20 ఏళ్లుగా వేసవి శిక్షణ శిబిరాలు
- విద్య, ఉద్యోగాలకు పలువురు క్రీడాకారుల ఎంపిక
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలు కైవసం



ఖోఖో శిక్షణలో భాగంగా ఫిట్‌నెస్ వ్యాయామాలు చేస్తున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ) పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ఇవ్వడంతో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా క్రీడల వైపు వారి దృష్టిని మళ్లిస్తే అటు ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు, ఇటు వారిలోని ప్రతిభను వెలికితీయవచ్చు. పిల్లల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయడం కోసం కాకినాడ నగరంలోని గుడారిగుంట మదర్ థెరిస్సా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖో–ఖో వేసవి ఉచిత శిక్షణ శిబిరం ఏటా నిర్వహిస్తున్నారు. క్రికెట్ మోజులో పడిన యువకులు గ్రామీణ క్రీడల్లో ఒకటైన ఖోఖోను ఒక దశలో మరచిపోయారు. పల్లె క్రీడ ఖోఖో ఉనికి కోల్పోతున్న దశలో కాకినాడకు చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు, ఖో–ఖో క్రీడాకారుడు శ్రీనివాసు ఖోఖో క్లబ్‌ను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ అందిస్తూ వందల సంఖ్యలో క్రీడాకారులను తయారు చేసి ఈ క్రీడకు ఆదరణ పెంచుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఖోఖో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి పలువురు పోలీస్ శాఖలోను, ప్రభుత్వ పాఠశాల్లో వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. 20 సంవత్సరాలుగా కాకినాడలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాల్లో ఇప్పటి వరకు దాదాపు 500 మంది ఇక్కడ తర్ఫీదు పొందారు.

10వ తేదీ వరకు నిర్వహణ

కోచ్ శ్రీనివాస్, అసిస్టెంట్ కోచ్ హరి ఆధ్వర్యంలో ఈ శిబిరం సాగుతోంది. 25 మంది బాలికలు, 25 మంది బాలురు ఈ శిబిరంలో శిక్షణ పొందుతున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7.30 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో శిక్షణ ఇస్తున్నారు. ఫిట్‌నెస్, ఖోఖో టెక్నిక్స్‌తో పాటు వీరికి ఆటలోని మెళుకువలు నేర్పిస్తున్నారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఉచితంగా దాతల సహకారంతో ప్రతీ రోజు ఉదయం ఉడకబెట్టిన గుడ్లు, మొలకెత్తిన గింజలు, రాగి జావ అందిస్తున్నారు. పిల్లల పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని వారిలో ఖో–ఖో పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. జూన్ నెల 10 వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుంది. ఆసక్తి గల క్రీడాకారులు ఈ శిబిరానికి హాజరుకావచ్చు. గుడారిగుంట ప్రభుత్వ పాఠశాలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు తమ అభిప్రాయాలు 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు.

ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేయడం కోసం...



నైపుణ్యం కలిగినవారిని గుర్తించి చక్కటి క్రీడాకారులుగా తయారు చేయడం కోసం ఏటా వేసవి ఉచిత ఖోఖో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది బాలుర క్యాంప్ రాజమహేంద్రవరంలోను, బాలికల క్యాంప్ కాకినాడ గుడారిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలో నిర్వహిస్తున్నాం. ఆసక్తి గలవారు 98487 08008 నంబర్‌లో సంప్రదించి శిక్షణలో చేరవచ్చు.

– శ్రీనివాసు, పీడీ, ఖోఖో కోచ్, కాకినాడ

ఇండియాకు ఆడడమే లక్ష్యం



నాపేరు డి.నందిని. నేను మదర్ థెరిసా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. ఇప్పటి వరకు 3 నేషనల్స్, 6 స్టేట్ లెవెల్ పోటీలలో పాల్గొన్నాను. ఇండియాకు ఎంపికై జాతీయస్థాయి జట్టులో ఆడాలనేది నా లక్ష్యం. కోచ్ శ్రీనివాస్ వద్ద రెండు సంవత్సరాలుగా ఖో–ఖోలో శిక్షణ పొందుతున్నాను.

శిక్షణ బాగుంది



నా పేరు జె.హేమదుర్గ. నేను నెహ్రూ ఎయిడెడ్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. తండ్రి నాగబాబు, తల్లి వీరగనిక కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఖో–ఖోలో రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం నా లక్ష్యం. ఖో–ఖోలో ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరంలో చేరాను. ఇక్కడ శిక్షణ బాగుంది.

ఆర్మీలో ఉద్యోగం సాధిస్తా



నా పేరు జె.విజయ చంద్ర శేఖర్. నేను గుడారిగుంట మదర్ థెరిస్సా ప్రభుత్వ ఉన్నత పాఠశాలో 8 తరగతి చదువుతున్నాను. ఖో–ఖో ఆడడం ఇదే మొదటిసారి. క్రీడాకోటాలో ఆర్మీలో ఉద్యోగం సాధించాలని ఖో–ఖో నేర్చుకుంటున్నాను.



ఖో–ఖో శిక్షణలో మెళకువలు నేర్చుకుంటున్న పిల్లలు

'నన్నయ' వర్సిటీ అభివృద్ధికి 'న్యూయోమ్' సహకారం



'న్యూయోమ్' సీఈఓ డాక్టర్ వంగలతో సమావేశమైన 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అభివృద్ధికి న్యూయోమ్ టెక్నాలజీస్ సంస్థ సహకారం అందించేందుకు ముందుకు రావడం హర్షణీయమని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. బెంగళూరులోని ఆ సంస్థ సీఈఓ కమ్ ఎండీ డాక్టర్ వంగల రజనీకాంత్‌తో యూనివర్సిటీ అధికారులు ఈసీ హాలులో శుక్రవారం సమావేశమై ప్రస్తుతం కల్పించవలసిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. విద్యార్థుల అభ్యసన, వ్యవస్థాపకత, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, ఆరోగ్య సంరక్షణలో ఆవిష్కరణల కోసం ఆ సంస్థతో కలిసి పని చేయనున్నామని వీసీ తెలిపారు. డాక్టర్ వంగల గోదావరి జిల్లాల వాసీ కావడంతో ప్రాంతీయ అభిమానంతో ఈ విధంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో కారు స్వాధీనం

మలికిపురం: ఈ నెల 13వ తేదీ సాయంత్రం కిడ్నాప్‌కు గురయిన రేకపల్లి నాగరాజు కేసులో కేశనపల్లి గ్రామానికి చెందిన ఒక యువకుడి కారును పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ కేసులో ఇప్పటికే నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.

సమ్మర్‌లో చదివేద్దాం

- వేసవి విజ్ఞాన శిబిరాలకు గ్రంథాలయాలు సిద్ధం
- జూన్ 7 వరకూ నిర్వహణ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏటా వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 2020, 2021లో రెండేళ్లపాటు రద్దు చేశారు. 2022వ సంవత్సరం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి గత నెల 29వ తేదీ నుంచి నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. అయితే పెరిగిన ఉష్ణోగ్రతలు, ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేశారు. తిరిగి ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో పఠనాశక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడం లక్ష్యాలుగా వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లా గ్రంథాలయ సంస్థ సమాయత్తమైంది. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ అంశాలపై 40 రోజులు శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జూన్ 7వ తేదీ వరకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించనున్నారు. సమీప గ్రంథాలయాలకు వెళ్లి సంప్రదించాల్సి ఉంటుంది. వివిధ సంస్థలకు చెందిన నిపుణులు తరగతులు నిర్వహి స్తారు.

రెండు విభాగాల్లో నిర్వహణ

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, ఆటలపై ఆసక్తి ఉన్నవారికి చెస్, క్యారమ్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేశారు. నృత్యం, పప్పెట్ల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇవ్వవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

సేవలకు అవకాశం

పేద విద్యార్థులకు స్వచ్ఛంద సేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, డ్రాయింగ్, తెలుగులో మంచి ప్రతిభ ఉన్నవారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు గ్రంథాలయ సంస్థ అవకాశం కల్పిస్తోంది. వేసవిలో ఇలాంటి సేవ ద్వారా ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఆస్కారం ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. ఒకొక్క కేంద్రానికి రూ.10వేల బడ్జెట్ కేటాయించారు. గత ఏడాది విజయవంతంగా నిర్వహించాం. విద్యార్థులు అధికంగా సెల్‌ఫోన్‌లకే సమయం కేటాయించి చిన్న వయస్సులోనే కళ్లజోళ్లతో కనిపిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు గ్రంథాలయాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. విద్యార్థుల ఫోన్ నంబర్లు సేకరించి నిత్యం శిక్షణకు వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. ఆసక్తి గల ఉపాధ్యాయులు, చిత్రలేఖనం, వృత్తి శిక్షణ చేసిన వారు గ్రంథాలయాల్లో విద్యార్థులకు సమయం కేటాయించేందుకు ముందుకు రావాలి. ఉమ్మడి జిల్లాకు దాదాపు రూ.12 లక్షలు నిధులు కేటాయించారు.

–వి.ఎల్.ఎస్.ఎస్.వీ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

జిల్లాలో ఇలా..

జిల్లా కేంద్ర గ్రంథాలయం 01, ప్రథమ శ్రేణి గ్రంథాలయాలు 05, ద్వితీయ శ్రేణి 10, తృతీయ శ్రేణి 86, పుస్తక నిక్షిప్త కేంద్రాలు 165.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలంలో నాగరాజు మృతదేహం

ఆలమూరు: మండలంలోని మూలస్థానం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బల్రే నాగరాజు (21) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన నాగరాజు తన ద్విచక్ర వాహనంపై సోదరుడి అత్తవారి నివాసమైన స్థానిక ఇందిరాకాలనీకి బయలుదేరాడు. ఆ క్రమంలో స్థానిక డివైడర్‌ను దాటి ఇందిరాకాలనీ రోడ్డులోకి వెళుతుండగా రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి నాగరాజును ఢీకొంది. నాగరాజుతో సహ ద్విచక్ర వాహనాన్ని కొన్ని మీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయి రక్షణ తీగలను తాకి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో నాగరాజుకు తలకు బలమైన గాయాలు తగిలి తీవ్ర రక్తస్రావం జరగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీస్, హైవే సిబ్బంది కలిసి సత్వరమే ప్రమాద స్థలికి చేరుకుని అప్పటికే నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై శ్రీను నాయక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిన్నంటిన రోదనలు

పెళ్లిడుకు వచ్చిన నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదంలో తన సోదరుడు మృతి చెందాడనే వార్త తెలియడంతో స్థానిక ఇందిరాకాలనీలో నివాసం ఉంటున్న మృతుని బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

భూతదయకు ప్రా'ధాన్యం'



బొమ్మూరు జంక్షన్‌లో ధాన్యపు కుచ్చులను విక్రయిస్తున్న రైతు యాళ్ల రుద్రం

తమ ఇంటికి ధాన్యం వచ్చే సమయంలో రైతులు వాటితో కుచ్చులను ప్రత్యేకంగా తయారు చేసి ఇంటి ముంగిట, హాల్లోను కడుతుంటారు. ఆ ధాన్యపు కుచ్చులలో ఉన్న గింజలను రామచిలుకలు, పిచ్చుకలు వచ్చి తింటూ ఉంటాయి. రైతుల భూతదయను చాటే ఈ దృశ్యాలు పల్లెల్లో సహజంగా కనిపిస్తాయి. నేడు పట్టణాల్లోనూ ఇవి దర్శనమిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజానగరం మండలం సంపత్‌నగరం గ్రామానికి చెందిన రైతు యాళ్ల రుద్రం ధాన్యపు కుచ్చులను ప్రత్యేకంగా అల్లి బొమ్మూరు జంక్షన్‌లో విక్రయిస్తున్నాడు. కుచ్చు సైజును బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నాడు. ముచ్చట గొల్పుతున్న ఈ ధాన్యపు కుచ్చులను అటుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొందరు కొనుగోలు చేసుకుని వెళుతున్నారు. రైతు యాళ్ల రుద్రం మాట్లాడుతూ ఈ ధాన్యపు కుచ్చులను 20రోజులుగా విక్రయిస్తున్నానని తెలిపాడు.

– రాజమహేంద్రవరం రూరల్

వ్యక్తి దుర్మరణం

మండపేట: ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలి కాగా ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మండపేటలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల మేరకు.. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన దాసరి శ్రీను(36) తన కుమార్తెను మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని మండపేట వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం పయనమయ్యాడు. పెద్ద కాలువ దాటిన తరువాత వీరభద్రపురం వచ్చే సరికి మాచవరం నుంచి ఎదురుగా వస్తున్న ఓ ఆటో అతివేగంతో మోటారు సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో మోటారు సైక్లిస్టు శ్రీను తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. కుమార్తెకు కాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే అంబులెన్సు సాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టౌన్ సీఐ షేక్ అఖిల్‌జమ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కొనసాగిన ఈ - కంటెంట్ జనరేషన్‌పై శిక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏపీ కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు క్రియేటివ్ ఈ కంటెంట్ జనరేషన్ విధానంపై ఇస్తున్న శిక్షణ రెండో రోజు శుక్రవారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నిష్ణాతుల నుంచి నేర్చుకున్న అంశాలను అధ్యాపకులు వారి సబ్జెక్టులలో ఈ కంటెంట్లను తయారు చేయడానికి ఉపయోగించి, దూరవిద్య ద్వారా చదువు కొనసాగిస్తున్న విద్యార్థులతో పాటు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న వారికి నాణ్యమైన విద్యను చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తమ కళాశాల పాలుపంచుకోవడం తమకెంతో ఆనందాన్నిస్తోందన్నారు. హైదరాబాద్ ఎడ్ జోన్ ఇంటర్నేషనల్‌కు చెందిన డాక్టర్ రామ్‌కుమార్ కృత్రిమ మేధస్సుకు (ఏఐ)కు సంబంధించిన అనేక అంశాలను వివరించి, వాటిని ఈ కంటెంట్ జనరేషన్లో ఎలా ఉపయోగించాలి అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారన్నారు. డాక్టర్ హరినాథ్ శర్మ కృత్రిమ మేధస్సును ఉపయోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలాగా, ఆకర్షణీయంగా పాఠ్యాంశాలను ఎలా రూపొందించాలో వివరించారన్నారు. యూనిస్కిల్స్ ఇండియాకు చెందిన ప్రొఫెసర్ ప్రవీణ్‌కుమార్‌శర్మ పాడ్‌కాస్టింగ్, ఆడియో ఎడిటింగ్‌పై అధ్యాపకులకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమానికి బి.వెంకట్రావు, సమన్వయకర్తగా విజయవాడ ఏపీసీసీఈకు చెందిన డాక్టర్ జె.జ్యోతి కన్వీనర్‌గా వ్యవహరించారన్నారు. శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డిగ్రీ కళాశాల నుంచి 86 మంది అధ్యాపకులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, సంజీవ్ కుమార్, దేవరాజ్, కిరణ్ కుమార్, ప్రవీణ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గొల్లప్రోలు: మండలంలోని వన్నెపూడి జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన చెప్పుల నానిబాబు(33) మోటారు సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా వన్నెపూడి జంక్షన్ వద్ద వెనక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నానిబాబు మృతి చెందాడు. దీనిపై గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అబ్బుర పర్చిన డాగ్ షో



డాగ్ షోలో అగ్ని వలయంలో నుంచి దూకుతున్న శునకం

ఆసక్తిగా తిలకించిన ఎన్‌సీసీ క్యాడెట్లు



షోకు హాజరైన ఎన్‌సీసీ అధికారులు

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో సాగుతున్న ఎన్‌సీసీ శిబిరంలో శుక్రవారం నిర్వహించిన డాగ్ షో క్యాడెట్లను అబ్బురపర్చింది. ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఐడీఎస్ఎస్‌సీ 2024కు ఎంపికైన క్యాడెట్ల శిక్షణ శిబిరంలో కాకినాడ ఏఆర్ డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో నేరాల తరువాత నిందితులను గుర్తించే తీరుపై అవగాహన కల్పిస్తూ డాగ్ షో నిర్వహించారు. కాకినాడ 18వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో ప్రతీ విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం డాగ్ షోలో భాగంగా డాగ్ స్క్వాడ్‌కు చెందిన లైకా, ప్రాక్సీ శిక్షణ పొందిన పోలీస్ శునకాలు పేలుడు పదార్థాలను గుర్తించడం, చెమట వాసన ద్వారా నిందితులను గుర్తించడం, దేశ చిత్రపటాలను గుర్తించడం, అగ్ని వలయాలు దూకడం, సెల్యూట్ చెయ్యడం వంటి వాటిని సునాయసంగా ప్రదర్శించి క్యాడెట్లను అబ్బురపర్చాయి. ఈ కార్యక్రమంలో ఏఆర్ డాగ్ స్క్వాడ్ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ సత్యనాణ, ఆర్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ వర్మతో పాటు ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.